# దుష్టశిక్షణ

"తప్పుని తెలిసినప్పుడు, శిక్షించుటకు తగినశక్తి ఉన్నప్పుడు పురుషుడు మౌనము వహించి శిక్షింపకున్న హింస చేసిన పాపమున పాల్పును

ఓర్యూడు; సప్తమాశ్వాసం. మహాభారతం.

"నీకు కర్మయందే యోగ్యత కలదు. కర్మఫలములను పుట్టించుట యందు సామర్థ్యము లేదు. కర్మ మానుట యందు ప్రీతి లేకుండు గాక"-

47వ శ్లోకం, రెండవ అధ్యాయం భగవద్గీత.

"న్యాయం కోసం భయాన్ని విడిచి, అహింస అవలంబించి పోరాడాలి - పదే పదే చచ్చేదాకా.

గాంధీ

* * *

నలుగురి మధ్య చోటు చేసుకొని పోవడానికి వీల్లేక ఉన్నచోట ఆగిపోయింది గాలి. మోతుబరి ఆసామి పొలంలో పైరు ఆకుపచ్చగా ఆహ్వానిస్తుంటే దాన్ని మేయబోయి పట్టుబడి, బందుల్దొడ్డిలో విడిపించే నాథుడికోసం ఎదురుచూస్తున్న ఆవులా నిలబడింది జయ. ఆ చుట్టూ ఉన్న నలుగురూ జయకి ఎలా కనిపిస్తున్నారంటే, అలవగొట్టి తాట ఒలవటానికి సిద్ధంగా నిలబడ్డ యానాదుల మధ్యలో ఉన్న పందికి కనిపించినట్టు, యమలోకంలోకి కొత్తగా వచ్చిన వాడికి యమదూతలు కనిపించినట్టు, పోలీసు స్టేషన్లో నేర మాపాదింపబడిన వాడిని కొట్లో పెట్టి కొట్టడానికి సిద్ధపడుతున్న రక్షకభటులు కనిపించేటట్టు భయంకరంగా కనిపిస్తున్నారు.

"ఎక్కడ పెట్టేవే?" అంటూ నిలదీసింది మహాలక్ష్మి. పేరేదైనా, అడిగినప్పుడు భద్రకాళిలా ఉంది. ఆమె మామూలప్పుడుచల్లని తల్లే! ఆమెకి జయ వయస్సు కూతురుంది. ఆ కూతురి పేరు జయంతి ఆ పిల్ల జయ అంత ఎత్తుగానే కాక ఒకింత పుష్టిగా ఉంటుంది. జయంతి లంగా జయకిచ్చింది. మహాలక్ష్మి నెల క్రితం ఆపేక్షగా.

"జయకి నాది నడుం దగ్గర వదులైపోతుంది" అంది జయంతి అప్పుడు.

"ఏం పర్వాలేదు. నడుం చుట్టూ ఓ సుట్టు తిప్పితే ఓ పిసరు మిగిలిపోతుంది. నాడా బిగించేస్తాను. సరిపోతుందియ్యండమ్మా!" అని జయ తీసుకొంది.

సినిమా తారల్లాగా గ్లామరస్‌గా ఉండాలని అమ్మాయి లనుకుంటే, సినిమా తారల్లాగా అమ్మయిగోర్ల లాగా మెరిసిపోయే ప్రయత్నాలు పనమ్మాయిలు చేస్తారు. అందుకే అప్పుడప్పుడు జయంతి బాడీలు ఒకటీ అరా కనిపించకుండా పోతాయి. పక్కపిన్నులు ఎక్కువ లెక్కనే కనిపించవు. పౌడర్లూ, స్నోలూ కొద్ది కొద్దిగా తరిగిపోతాయి.

జయ ఎండినట్టుండదు. కాని ఏ బాడీ వేసుకొన్నా దానికి నిండుతనం ఉండదు. ఏం రాసుకొన్నా తెల్లగా ఉండదు. ఏం రాసుకోకపోయినా అందంగానే ఉంటుంది.

"నేన్తియ్యలేదు." అంది జయ భయంగానూ, మొండిగానూ.

అసలేం జరిగిందంటే పచ్చగా మిసమిసలాడ్తూ జయంతి పెళ్ళీడుకు రాగానే, ఇంట్లో చిరుగుపట్టని పాతబట్టల్తో స్టెయిన్‌లెస్ స్టీలు సామాన్లు కొని జయంతికి సారె ఏర్పాటు చెయ్యటం మొదలుపెట్టింది మహాలక్ష్మి. ఆమె చిరుగుపట్టిన బట్టలే ఇస్తుంది జయకిచ్చినా, మరొకళ్ళకి ధర్మం చేసినా. ఈమధ్యనే కూతురి కామె బంగారపు దుద్దులు చేయించగలిగింది. అవి ముద్దుగా ఉన్నాయి. జయంతికి పుట్టినప్పుడు చెవులు కుట్టించి పెట్టిన సన్నకాడ వయసుతో అరిగింది కాని పెరిగింది కాదు. అందుకని జయంతి చెవుల రంధ్రాలు సన్నగా, నాజూకుగా ఉండిపోయాయి. కొత్త దుద్దుల కాడలు కాస్త పెద్దవి అయ్యాయి. ఆ ఆదివారప్పూట దుద్దులు పెట్టుకోబోతుంటే ఒక చెవికైతే దుద్దు ఎక్కింది కాని రెండోదానికి సులభంగా ఎక్కింది కాదు. సబ్బు రాసి ఎక్కించినా రక్తం రానే వచ్చింది. అప్పుడు సీలని అద్దం కింద ఉన్న బల్లమీద ఉంచేసి, వంటింట్లోకి వెళ్ళి చెవికి పసుపు అంటించుకొని వచ్చింది. తిరిగి వచ్చినప్పుడు సీల కనిపించలేదు. గదిలో జయ కనిపించింది.

జయంతికి జయమీద అనుమానం కలిగినా చదువులు తెచ్చిన మొహమాటంవల్ల, "బంగారపు సీల చూశావా జయా?" అని అడిగింది "తీశావా?" అని అడగలేక.

జయ "లేదమ్మా!" అంది.

జయంతి తల్లిని పిలిచింది. ఎర్ర నేతచీర కొంగుకి, చెయ్యి తుడుచుకొంటూ ఆమె వచ్చింది. ఇద్దరు కలిసి కాసేపు వెతికారు. అంతసేపూ జయ కదలకుండా, బౌలర్ ఎల్బీడబ్ల్యూకి ఎప్పీలు చేసినప్పుడు అంపైర్ నిర్ణయం అయ్యేవరకు కదలకుండా నిల్చునే బాట్స్‌మన్‌లాగా

నిలబడిపోయింది.

"ఇచ్చేయ్ !" అంది మహాలక్ష్మి జయతో. ఆమెకి అనుమానం దాచుకోవటం చేతకాదు. ఆమె తియ్యటం ఈమె చూసినంత ధీమాగా అడిగింది. భార్యతో మాట్లాడేటప్పుడు భర్తకి, కింద వారితో మాట్లాడేటప్పుడు పెద్దవారికి ఉండే సహజమైన ధీమా అది. మహాలక్ష్మి అలా అడిగితే అధికారాన్ని జయ కాదనలేదు. కాని అలా శంకించడాని కామె కంపించనూ లేదు.

"ఇచ్చేయటానికి నేన్తీశానేటి? అమ్మాయిగోరే ఎక్కడో పెట్టి మర్చిపోయుంటారు. సరిగ్గా గుర్తు తెచ్చుకోండమ్మా" అని సలహా ఇచ్చింది జయ.

కాని జయ ఎప్పుడు భయపడిందంటే తల్లీ కూతుళ్ళు కూడబలుక్కుని, తల్లి తనకి కాపలా కాస్తూ ఉండగా, కూతురు వెళ్ళి తండ్రీ కొడుకుల్ని పిలుచుకొని వచ్చినప్పుడు.

తండ్రి రంగారావు ఇంట్లోనే ఉన్నాడు. ఆదివారం కనక ఇంకా స్నానం చేయలేదు. చేసినా నల్లగానే ఉంటాడు. తెల్లపంచ లుంగీ లాగా చుట్టుకొన్నాడు. కట్నంలో కన్సెషనిచ్చి తెల్లపెళ్ళాన్ని తెచ్చుకొన్నాడు. అతను పొద్దున్నే న్యూస్‌పేపర్లో దొంగతనాల గురించి, హత్యల గురించి చదివి 'మండిపోతాడు. అతని కధికారం ఉంటే వాళ్ళ చేతులు నరికేసును. ఆ తరువాత బలాత్కారాల గురించి, మానభంగాల గురించి చదివి బెంగపెట్టుకొంటాడు. ఇంట్లో వయసొచ్చిన కూతురుంది. ఆ పిల్ల వీధిలోకి వెళ్ళినప్పుడు, ఈ అఘాయిత్యాల నుంచి ఎలా రక్షించుకోవాలో తెలియక అల్లాడిపోతాడు. చదువుకునే పిల్ల వీధిలోకి వెళ్ళకా తప్పదు. తోడేళ్ళ కళ్ళ పడకా తప్పదు! తొందరగా పెళ్ళి చేసి అల్లుడికి అప్పచెప్తే తన బాధ్యత తీరిపోతుంది. అమ్మాయి అల్లుడు తోడు లేకుండా వీధిలోకి వెళ్ళే సందర్భాలు పెద్దగా ఉండవు కనక - ప్రమాదం తగ్గుతుంది.

"ఏమైంది? ఏమైంది?" అంటూ అతను ఆదుర్దాగా వచ్చాడు. ఆ క్రితం రాత్రి, ఊరు శివార్లలో జరిగిన దారుణమైన దోపిడీ గురించి చదివి మనసులో వాళ్ళందరికీ ఉరిశిక్షలు వేస్తూ ఉద్రేకంగా ఉన్నాడు జయంతి పిలిచినప్పుడు.

చదువుల గదిలోంచి మధు వచ్చాడు. అతను తల్లి ఒంటిరంగు, తండ్రి వంటిరంగు కలబోసుకొని ఉన్నాడు. మెరుపు తగ్గిన బంగారంలా ఉన్నాడు. అంతకు పూర్వం కొద్ది నిముషాల ముందు అతను ఆ గదిలోకి రాబోయాడు. ఎప్పుడు? జయ అతని గది తుడిచి ఈ గది తుడవటానికి వచ్చినప్పుడు. తనకి నచ్చే పువ్వు ఏదో తెలుసుకోలేక, పువ్వైతే చాలు, దాని చుట్టూ పల్టీలు కొట్టే అప్పుడే వయస్సు వచ్చిన భ్రమరంలా జయ వెంట వెంటనే తిరుగుతాడు మధు. ఆమె గదులు తుడిచినంతసేపూ. జయకి కూడా అదేదో ప్రమాదం లేని సరదాలా తోచి ఊరుకొంటుంది. జయకి పద్దెనిమిదేళ్ళ కుర్రాళ్ళ మంచితనంలో నమ్మకం ఉన్నట్టుగా పాతిక పైబడ్డ మగాళ్ళ మంచితనంలో లేదు. నలభై దాటి, అమ్మగారింట్లో లేకపోతే మరీ డేంజరే!

జయ మధు కంటే పెద్దది. అందుకనీ, మధు కింకా వయసు రాలేదని నమ్మబట్టీ

మహాలక్ష్మి పట్టించుకోదు. కాని జయంతి? పట్టించుకోవచ్చు. అందుకే జయ వెంట నడిచిన మధు, అక్క గదిలోకి మరో గుమ్మంలోంచి రావటం గమనించి తప్పుకొన్నాడు.

"ఏమైందంటారా? ఏడాది పాటు నెత్తి నోరూ కొట్టుకొని గొడవ చేసి మీచేత కొనిపించిన దుద్దు లున్నాయే - అందులో ఒకదాని సీల కనిపించటంలేదు" అంది మహాలక్ష్మి.

"ఎవరైనా తీశారంటావా?" అని అడిగాడు రంగారావు జయని అనుమానంగా చూస్తూ.

"జయ తప్ప మరెవ్వరూ ఈ గదిలోకి రాలేదు". అంది మహాలక్ష్మి.

జయ బేలగా చూసింది.

మధుకి జాలి వేసింది.

"సరిగ్గా వెతికావా, అక్కా?" అని అడిగాడు.

"వెతికాను. ఈ టేబుల్‌మీద పెట్టి వంటింట్లోకి వెళ్ళి రెండునిముషాల్లో వచ్చాను" అంది జయంతి. ఆమె జరిగింది చెప్పింది. నేరారోపణ చెయ్యలేదు.

మధు మళ్ళీ వెతికాడు బల్లమీద వస్తువులు ఒకటొకటే తీస్తూ. "మర్యాదగా ఇచ్చేయ్" అన్నాడు కోపంగా

"నేన్తియ్యలేదు" అంది మొండిగా జయ.

రంగారావు రెట్టించిన కొద్దీ జయ మొండికేసింది. జయ మొండికేసిన కొద్దీ రెచ్చిపోయి రంగారావు రొప్పసాగాడు. జయని తప్పు ఒప్పుకొనేలా చెయ్యలేని తన అశక్తతమీద రంగారావుకి కోపం వచ్చింది.

"రెండు తగిలిస్తే సరి " అన్నాడు. ఆ రెండూ ఎవరు తగల్నియ్యాలో తెలియకపోయినా.

జయ కొట్టినంత గోల చేసింది. ఆ గోల పక్కింటి పనిపిల్ల సీతాలు చెవిన పడింది. సీతాలు రెండిళ్ళఉమ్మడిగోడ దగ్గరకు వచ్చి మునివేళ్ళమీద నిలబడింది. అప్పుడా పిల్ల కళ్ళు గోడమీదకి వచ్చాయి.

"ఏటే జయా? ఏటైంది?" అని అడిగింది గోడ కింద నోటితో.

"నాకు దొంగతనం అంటకట్టారు. కొట్టబోతున్నారు. మా అమ్మనీ, అయ్యనీ పిల్చుకురావే!" అంటూ జయ కొమ్ము విసిరింది.

"నిన్ను కట్టేశారా?" అని అడిగి, లేదని తెలుసుకొని పరిగెత్తింది సీతాలు.

పరిస్థితులు ముదిరాయని మహాలక్ష్మి గ్రహించింది.

"వెధవగొడవ మన కెందుకండీ! వెళ్ళి పోలీసులను పిలుచుకురండి" అంది మొగుడితో.

రంగారావు కదిలాడు.

రంగారావు కదిలిన పావుగంట లోపల జయ తల్లీ, తండ్రీ వచ్చారు. జయ తండ్రి చిందుల్తొక్కుతూ వచ్చాడు. అతనికి తన కూతుర్ని దొంగన్నందుకు కాక అనే ధైర్యం ఉన్నందుకు ఆ ఇంటి వారిమీద కోపం వెళ్ళగక్కాడు.

"ఎవరంట నా కూతుర్ని దొంగన్నది? విడిచిపెట్టండి" అన్నాడు. అందులోనూ దౌర్జన్యంగా అన్నాడు. వెంకటేశ్వరస్వామి పేరు చెప్పుకొని బెదిరిస్తూ ముష్టెత్తుకొనే బిచ్చగాడి దౌర్జన్యం అది. జయ తల్లి శోకాలు, శాపనార్థాలూ సమపాళ్ళలో పెట్టింది. అందులో అఘాయిత్యం పాలే ఎక్కువ.

అయినా వాళ్ళ గొంతుకలు విని జయ బయటకు రాబోయింది. మహాలక్ష్మి అంతకంటే ముందే వీధి తలుపు మూసింది. పోలీసుల్ని తీసుకొని అయ్య వచ్చేదాకా, అమావాస్యని వెళ్ళిపోనీ దల్చుకోలేదు. జయ తలుపు దగ్గరకు పరిగెత్తింది.

"దాన్ని పట్టుకోండ్రా!" అని అరిచింది మహాలక్ష్మి.

మధు, జయంతి వెళ్ళి చెరో చెయ్యీ పట్టుకొన్నారు. మధుకి అక్క, అమ్మ ఉండగా జయ చెయ్యి పట్టుకోవడం ఇబ్బందిగా ఉంది. కాని అప్పుడు కూడా జయ చెయ్యి తను ఆశించినంత మెత్తగా లేదని లోపలి ఎముక గట్టిదనం తెలుస్తోందని గుర్తించగలిగాడు.

మహాలక్ష్మి నింపాదిగా వచ్చి, జయ చెవికి సీల లేకుండా వేలాడుతున్న దుద్దును తీసి దాచి వచ్చింది.

బయటినుంచి "రాయే తల్లీ!" అని తల్లి, లోపల్నుంచి "అమ్మా! అమ్మా!" అంటూ జయ గోల పెడుతుండగా రంగారావు ఆడ పోలీసుల్ని తీసుకొని వచ్చాడు.

వీధిలో జయ తల్లిదండ్రుల్ని చూసి - "ఎవరు మీరు?" అని అడిగాడు రంగారావు, తెలియక.

"జయని కన్నోళ్ళం" అంది జయ తల్లి నిష్ఠురంగా.

జయ తండ్రికి రంగంలోకి పోలీసులు రావచ్చునని తట్టలేదు. అందుకని ధైర్యంగా వచ్చాడు. వాళ్ళు రాగానే మొహాన్ని చేతుల్లో దాచుకొన్నాడు, దుఃఖం పట్టలేక, అవమానంచేత అనిపించేటట్టు. కాని ఆలస్యం అయిపోయింది.

"కేడీ రాములు కూతురా మీ పనిపిల్ల?" అంది ఒక ఆడపోలీసు. ఆమె చీర కట్టుకొంది కనుక ఆడదనుకోవాలి గాని గొంతుక మాత్రమే విని ఉంటే మగే అనుకొనేలా ఉంది. ఆమె మరో నాలుగు సంవత్సరాల సర్వీసు తరువాత లాగూ, చొక్కా వేసుకొంటే అచ్చు మగాడికిందే ఉంటుంది. పోలీసు సర్వీసుతో స్త్రీ సహజమైన సుకుమారత్వం లేదామెలో. రెండో పోలీసు కింకా సర్వీసు లేదు.

అందుకని, ఆమె "కేడీ రాములు కూతురైతే వస్తువు తీసే ఉంటుంది" అంది.

రంగారావు గొంతు విని మహాలక్ష్మి తలుపు తీసింది. తీసి రంగారావుని, "ఇంత ఆలస్యం అయిందే?" అని అడిగింది.

"ఆడపోలీసులు దొరకద్దూ? ఆలస్యం అయింది. లేకపోతే మళ్ళీ అదో గొడవ" అన్నాడు రంగారావు.

"మర్యాదగా వస్తువిచ్చేయ్" అంది మగగొంతుకతో ఆడపోలీసు.

"నేన్తియ్యలేదు" జయ ఇందా కట్లాగే జవాబు చెప్పింది. అయితే అడిగిన మనిషి రకం వేరు. .జయ చెంప పేలిపోయింది. మధు, జయంతి జయ చేతులు వదిలిపెట్టేశారు.

"చంపేస్తోంది నాయనోయ్" అని అరిచింది జయ. 'పోలీసులు, మరి చంపరా?' అనుకొన్నాడు ఆమె నాయన.

"చంపెయ్యడం పూర్తయ్యాక పాతిపెట్టేస్తానే లంజకానా!" అంది మళ్ళీ ఆమె.

"ఎక్కడ పెట్టేవు?" అని నెమ్మదిగా అడిగింది రెండో పోలీసు.

"బొడ్లోనో, బాడీలోనో పెట్టుంటుంది. మంచంలో మొగుడ్తో తొంగుండి మంచం కింద రంకుమొగుణ్ణి దాచేరకం. బట్టలూడదీస్తే సరి" అంది వయసులోను, అధికారంలోను పెద్దపోలీసు.

మహాలక్ష్మి మనస్సులో ఆ మాటే ఉన్నా అనే ధైర్యం లేదింతసేపూ.

"అక్కడే దాచుండాలి" అంది ఇప్పుడు ధైర్యంగా. బట్టలూడదీయటం విషయం విడిచిపెట్టింది పోలీసులకి.

ఆడవాళ్ళు జయని లోపలి గదిలోకి తీసుకుపోయి తలుపు వేశారు.

"విప్పు" అంది దుర్యోధనుడిలాగా మగగొంతుక ఆడపోలీసు.

ఆమె ఆజ్ఞ అనుసరించి రెండో ఆడపోలీసు, చీరను దుశ్శాసనుడి లాగా లాగి పారేసింది.

జయ తనకి త్రాతలు లేరని మొరపెట్టుకోలేదు. లీనాంగి అయిందే కాని కిక్కురుమనలేదు జయ, తన జాకెట్టుని పోలీసు ఊడలాగినప్పుడు.

మధు లోపల జరుగుతున్న వస్త్రాపహరణం పట్ల కుతూహలం ఉన్నా దాన్ని జయ పట్ల మనసులో ఓ మూల ఉన్న అభిమానం నొక్కేసింది.

రంగారావు తన కర్తవ్యం తను నిర్వహించిన నిర్విచారంతో ఉన్నాడు.

జయ వేసుకొన్న బాడీ చూసి జయంతి ఆశ్చర్యపోయింది. గబుక్కున "ఆ బాడీ నాది" అంది.

"నీదా? అయితే మరి తీసుకో" అంది నవ్వుతూ మగగొంతుక పోలీసు.

రెండో పోలీసు అది విప్పబోయింది. జయ దానికి తన రెండు చేతులు అడ్డువేసి

రక్షణ కల్పించింది.

అప్పుడు ప్రబంధనాయకుడి లాగా, జయ లంగా ముడి సడలించింది సీనియర్. లంగా కుప్పగా జారిపోయింది. జయ అసంకల్పిత ప్రతీకార చర్యవల్ల చేతులు దింపేసింది. అదను చూసుకొని జూనియర్ బాడీ వడుపుగా వలిచేసి జయంతి వైపు ఎగరేసింది.

అప్పుడు చిన్నగా మెత్తటి శబ్దం వేస్తూ బంగారపు సీల కిందపడింది. ఎక్స్‌పెక్ట్ చేసిందే అయినా అందరు ఎక్సైట్ అయ్యారు. ఆరోపించిన నేరం మెరిసిపోతూ కళ్ళబడి రుజువు అయింది.

మహాలక్ష్మి సీల తీసింది.

గాల్లో బాడీ జండాలాగా రెపరెప కొట్టుకొంది క్షణంసేపు. నల్లగానూ, నగ్నంగానూ ఉన్న జయ - స్నానం చేయించటంతో అంటుకొన్న మకిలిపోయిన అమ్మవారి విగ్రహంలా ఉంది.

జయంతి చేతిలో తన బాడీ ఉంది. ఆ బాడీమీద కఱ్ఱుంది. ఆ కఱ్ఱు ఎప్పుడు? ఎక్కడ? ఎలా? అయిందో జయంతికి గుర్తుంది. అందుకనే దాన్ని వెంటనే తనదిగా గుర్తు పట్టింది.

"ఆ కఱ్ఱేమిటే బాడీమీద?" అని అడిగింది తల్లి. ఇంట్లో బట్టలన్నింటికీ ఆమె దగ్గరుండి సబ్బు వేసి ఉతికిస్తుంది.

"నా దగ్గరున్నప్పుడు లేదు. జయే అంటించి ఉంటుంది" అని టక్కున అబద్ధం ఆడేసింది జయంతి.

జయ అప్పుడు జయంతిని ఓ చూపు చూసింది. ఆ చూపుకే శక్తి ఉంటే అబద్ధం ఆడిన జయంతిని నిలువునా కాల్చి పారేసేది.

"ఇక్కడెవరూ మగాళ్ళులేరు. నిన్ను చూసి కైపెక్కిపోయి కౌగలించేసుకొడానికి. బట్ట లేసుకొని స్టేషన్‌కి నడు" అంది రాటుతేలిన పోలీసు.

జయ బట్టలు వేసుకోగా, కసాయి వాళ్ళు మేకపిల్లను లాక్కెళ్ళినట్టు పోలీసు లామెను లాక్కెళ్ళారు. దుష్టశిక్షణకి.

"మనవస్తువు మనకి దొరికింది కదా! జయని విడిచిపెట్టమనరాదా!" అని కోరింది మహాలక్ష్మిలోని తల్లి.

"న్యాయం తన దార్లో తను పోతుంది. మనం అడ్డు తగలరాదు" అన్నాడు రంగారావు శాంతంగా.

జయ బాడీని తీసుకొని తన బట్టల అలమారులో పెట్టబోయి, జయ వంటిని వేసుకొన్నదని గుర్తు వచ్చి ఉతకడం కోసం నీళ్ళగదిలో పడేసి వచ్చింది. బాడీమీద ఆ కఱ్ఱు ఎలా

అయిందో జయంతికి గుర్తుకు వచ్చింది.

తన క్లాసమ్మాయి ఒకతి డబ్బున్నది కనక బర్త్‌డే పార్టీ ఇచ్చింది చాలామందికి. అందులో తను ఒకత్తి. సంజయ్ మరొకడు. అక్కడే పరిచయం అయ్యాడు సంజయ్. అతనికి తల్లి లేదుట పాపం. తండ్రి ఎప్పుడూ పనులమీద ఇల్లు పట్టకుండా తిరుగుతూ ఉంటాడుట. పాపం అందుకని అతను ఎక్కువ ఒంటరితనంతో బాధపడుతూ ఉంటాడుట. అతను చెప్పాడు ఆ విషయం. ఆ తరువాత వాళ్ళింటికి వెళ్ళినప్పుడు నిజమే అని గ్రహించింది జయంతి. వాళ్ళిద్దరు పరిచయం జాలితో మొదలైంది. జాలితో పెరిగింది. జయంతితో సంజయ్ ఒక రోజున "జయ్ ఇంతీ! నువ్వు నా ఇంతివి" అంటూ అనేదాకా పెరిగింది. ఆ మాటలు వింటూ ఆ ఇంటిని చూసి జయంతి తనకి పట్టబోయే అదృష్టానికి పొంగిపోయింది. ఆపైన సంజయ్‌ని చిన్న చిన్న చొరవలు కొన్ని చెయ్యనిచ్చింది.

కాని వాసన, రుచి నచ్చనిది ఏదో బలవంతాన అతను తనచేత తాగించపోయినప్పుడు నోరు గట్టిగా మూసేసుకొంది ఒకరోజు అతనింట్లో. అతను బలవంతాన నోరు తెరవటానికి చేసిన ప్రయత్నంలో ఆ గ్లాసులోనిది జాకెట్లోకి వలికి బాడీ తడిసింది. జయంతి సంజయ్‌ని దూరంగా తోసేసి ఇంటికి పరిగెత్తుకుంటూ వచ్చింది. కర్రు బాడీకే అయింది. అదృష్టం కొద్దీ జాకెట్టు కవలేదు. దాన్ని తీసి పరుపు కింద దాచింది. అది జయ కొట్టేసింది. పోతే పోయిందని నోరు మెదపలేదు. పోలీసుల ఎదురుగుండా తను నోరు జారింది. కాని తను తెలివిగా తప్పుకోగలిగింది. మళ్ళీ సంజయ్‌ని కలవలేదు. పాపం ఎలా ఉన్నాడో!

❀ ❀ ❀

బుధవారం సాయంత్రం భారతం ముందేసు క్కూర్చుని చదువుకుంటున్నాడు రంగారావు.

మహాలక్ష్మి వచ్చి కింద చాప పరుచుకొని కూర్చుని "ఏమండీ! పాపం జయని విడిపించండి. దాన్ని మనింట్లో పని మానిపించేస్తాను అది దొంగని మనం భయపడుతున్నాం కనక. పాపం దాని తల్లి వచ్చి ఒకటే ఏడుస్తోందండీ. వాళ్ళ ఉసురు మన కెందుకు! అది జైల్లో పడితే మనకేం లాభం?' అని నచ్చచెప్పబోయింది.

"ఎవరిమటుకు వాళ్ళు అలా అనుకోవడం వల్లే దేశంలో దొంగతనాలు ఎక్కువైపోయాయి" అన్నాడు రంగారావు.

"ప్రపంచంమీదున్న అందరు దొంగల్ని మనం పట్టిస్తున్నామా! మనం ఒక్కళ్ళం ఒకర్ని పట్టిస్తే ఏమౌతుంది?"

"దేశం బాగుపడుతుంది. ఎవరిమటుకు వాళ్ళు వాళ్ళ చేతిలో ఉన్నంత మంచి చెయ్యాలి. ఎవరిమటుకు వాళ్ళు, వాళ్ళ శక్తిననుసరించి న్యాయరక్షణ దుష్టశిక్షణ చెయ్యాలి.

అప్పుడే రామరాజ్యం ఏర్పడుతుంది. చూడు భారతంలో ఔర్వుడు ఏమంటున్నాడో ఎవరైనా నేరం చేసినప్పుడు". "అదినీకు తెలిసి నీకుశిక్షించే శక్తి ఉన్నప్పుడు శిక్షించకపోతే అదే ఒక నేరం అంటున్నాడు. మనం జయని పట్టివ్వకపోతే అది నేరం అవుతుంది".'

ఈ మాటలు మధు కూడా వింటున్నాడు. అతనికి జయమీద అభిమానం ఉంది. ఆ అభిమానం వల్ల ఆ పిల్ల మళ్ళీ తనకి కనిపించాలని కోరుకుంటున్నాడు.

"జయపట్ల పోలీసులు నేరం చేస్తేనో?" అన్నాడు బయటకు వచ్చి మధు తండ్రితో.

"వాళ్ళకంటే పెద్ద అధికారులు వాళ్ళని శిక్షించాలి."

"వాళ్ళకి నేరం జరిగినట్టు తెలియకపోతే శిక్షించరు కదా!"

"వాళ్ళ తప్పు కాదు అప్పుడు శిక్షించకపోవటం."

మరి భారతం ప్రకారం రాజుల్ని ఎవరు శిక్షించగలరు వాళ్ళే తప్పు చేస్తే?" మధు జయ మాట మరిచిపోయి చర్చలో పడ్డాడు.

"అందర్లోకి బలవంతుడైన రాజు తనకంటే బలహీనులైన రాజులు తప్పు చేస్తే అది తనకి తెలిస్తే శిక్షించాలి. బావుంది. అతనే తప్పు చేస్తే?"

రంగారావుకి ఒళ్ళు మండింది. "దేవుడే దిగి వస్తాడు. రావణాసురిడి విషయంలో రాముడు రాలేదూ! అంతే."

మధు కెందుకో ఈ సిస్టమ్ కన్విన్సింగ్‌గా లేదు. "రావణాసురుడు బుద్ధిమంతుడేం కాదు కదా! సీత నెత్తుకుపోకముందు చాలా మందినే ఎత్తుకు పోయుంటాడు. రాముడు దేవుడు కదా! ఈ విషయం తెలియకపోతుందా! ఎందుకు వెళ్ళి శిక్షించలేదు. తన భార్య నెత్తుకుపోయేవరకు ఎందుకు ఆగాడు?"

"పాపం పరివక్వం అయ్యేవరకు రావణాసురుడిని ఎవరూ ఏమీ చెయ్యలేరని తెలిసి."

"మనం మరి జయ పాపం పండేవరకు ఎందుకు ఆగలేదు?"

"పాపం పండి ఉంటుంది కనుకే మనకా బుద్ధి పుట్టింది. సరేనా! ఈ తెలివితేటలు చదువులో చూపిస్తే పైకొస్తావు" అని విసుక్కున్నాడు రంగారావు.

ఈ చర్చ జరుగుతున్న సమయంలో జయంతి సంజయ్‌ని చూడటానికి వెళ్ళింది. ఈ క్రితం రోజు సంజయ్ కనిపించి తను మూర్ఖంగా ప్రవర్తించినందుకు నొచ్చుకొంటూ క్షమాపణ చెప్పుకొన్నాడు. ఆ మర్నాడు తనింట్లో జయంతి తనని కలుసుకొనేటట్టు సంజయ్ బతిమాలి ఒప్పించాడు.

సంజయ్‌కి చెట్టున పండుండి, దాన్ని తినాలనిపిస్తే, అది తన ఒళ్ళో రాలేదాకా వేచుండే ఒర్పు లేదు. కాని చెట్టుని కుదిపి తన ఒళ్ళో రాల్చుకొనే నేర్పుంది. ఒకోసారి ఆ నేర్పు

కోరిన ఫలితాన్ని సాధించకపోతే కర్రతో కొట్టి రాల్చి పీక్కుతినే క్రౌర్యం ఉంది. జయంతి అతన్ని పండులా ఊరిస్తోంది. అయితే, ఆమె సాంప్రదాయం చెట్టుని పట్టుకొని వేలాడ్తోంది. ఆ చెట్టు ఆమెకి ఆసరాగా ఉంది.

జయంతి గుమ్మంలోకి రాగానే, పొంచున్న పులి లేడి మీదకు దూకేటట్టు దూకి మెడ పట్టుకొని గుహలోకి లాక్కుపోయినట్టు ఒడిసిపట్టుకొని మంచం ఉన్న గదిలోకి లాక్కుపోయాడు.

ఆమె మెత్తటి శరీరాన్నే చూశాడు కాని, రాయిగా మార్తున్న మనసు గమనించలేదు. అధరామృతాన్ని గ్రోలుతున్నాననుకొని ఉప్పటి కన్నీటిధారల్ని పట్టించుకోలేదు. ఆమెతో పక్క పంచుకొంటున్నందుకు సంతోషించాడు కాని ఆమె తనతో జీవితం పంచుకోదలుచుకొందనీ, అది కానిపని అనీ కించపడలేదు.

సంజయ్ విడిచిపెట్టాక, జయంతి బంగారపు మరబొమ్మ నడుచుకొచ్చినట్టు ఇంటికి వచ్చింది. జయంతిని చూడగానే మహాలక్ష్మి కీడు శంకించింది. జయంతి వెనకాతలే నడిచి, "ఏం జరిగిందే తల్లీ?" అంటూ అనునయించింది.

జయంతి ఏడుస్తూనే ఏం జరిగిందో చెప్పింది.

"అతని ఇంటికెందుకెళ్ళావే ముదనష్టపుదానా?" అంటూ కూతుర్ని తిట్టింది, కొట్టింది. కావలించుకొంది. ఏడ్చింది. తమాయించుకొంది.

"చూడండి. నేను చెప్తూనే ఉన్నాను. మనకి జయా వాళ్ళ అమ్మా, నాన్నల ఉసురు తగిలింది. జయ సీల తీసింది. పోలీసుల్ని పిలిచాం. సీల దొరికింది. జయని పోలీసుల వెంట సాగనంపాం శిక్ష పడాలంటూ. ఇదిగో ఇప్పుడు డబ్బుతో కొవ్వెక్కిన వాడి కొడుకు మన అమ్మాయి శీలాన్ని అపహరించాడు. ఎవరితో చెప్పి దాన్ని వెనక్కి తీసుకువస్తారో రండి. ఎవరితో చెప్పి వాడికి గట్టి శిక్ష పడేలా చేస్తారో చెయ్యండి!" అంది రంగారావుతో మహాలక్ష్మి.

ఇదంతా ఆమె ఏకబిగిని చెప్పలేదు. శోకంతో ముక్కెగబీలుస్తూ, సంజయ్ మీదో, భర్తమీదో, కూతురు మీదో స్పష్టంగా తనకే తెలియని కోపంతో ముక్కుపుటా లెగరేస్తూ, కలగాపులగంగా ప్రతి వాక్యాన్ని మాట మాటనీ తెగగొడుతూ చెప్పింది. అంత బాధలోనూ, కోపంలోను ఇంటి భాగవతం పక్కింటి వాళ్ళ చెవిని పడకుండా జాగ్రత్త తీసుకుంటూ నోర్ధు నొక్కుకుని చెప్పింది.

ఆ వార్త, విశేషాలు వంటబట్టేసరికి రంగారావు వంటికి ఘాటైన పదార్థం తిన్నప్పటిలాగా చెమట పట్టింది. జయంతి నడిగి సంజయ్ విశేషాలు రాబట్టాడు.

శీలం దోచుకొన్నవాడు అమ్మాయి ఇష్టపడేవాడే కనక అతన్ని శిక్షించే ప్రసక్తి లేదు. అతని కాళ్ళు కడిగి కన్యాదానం చెయ్యటమే శరణ్యం అని నిర్ణయించుకొన్నాడు. భార్య అదే సరైన పని అని సమర్థించింది. జయంతికి జరిగిన దాంట్లో పూర్తిగా సంజయ్‌దే తప్పనిపించలేదు.

వ్రతం చెడ్డా ఫలితం దక్కాలంటే అతనికి భార్య కావటమే మార్గం అనుకొంది.

ఆ మర్నాడు పొద్దున్నే రంగారావు జయంతిని తీసుకొని సంజయ్ ఇంటికి బయల్దేరాడు. గొప్ప వాళ్ళింటికి వెళ్ళటానికి ధైర్యం కోసం ఉన్నవాటిల్లో కల్లా మంచి బట్టలు వేసుకున్నాడు.

సంజయ్ తండ్రి వ్యాపారస్థుడు. అతను ఉప్పట్టిన ఇనపరేకుల్ని కొంప కప్పుకోవటానికి కూలీవాడికి బజార్లో బాహాటంగా అమ్మినంత సులభంగా చాటుగా తుపాకులు టెర్రరిస్టుల కమ్మగలడు.

అతని కేది అమ్మటానికి అనర్హమూ, అల్పమూ కాదు, అమూల్యం అనఘం కాదు. అవకాశం వచ్చి కొనేవాడుంటే దేశాన్ని కూడా అమ్మేయగలడు. లాభం వస్తుందంటే పెట్టాల్సిన పెట్టుబడి విషయంలో తప్పొప్పులు, నీతినియమాలు ఆలోచించడు. అతను పెళ్ళాం బతికుండి వయసులో ఉన్న రోజుల్లో ఆమె వయసును పెట్టుబడి చేసుకొని ఆస్తి గడించాడు. సంజయ్ అతనికి పుట్టినవాడే. అవే బుద్ధులు!

ఈ వెధవ జగత్తులో అన్నింటికీ మూలం ధనం అని అది సంపాదించటానికి ఉన్న అన్ని మార్గాలూ ఉత్తమమైనవే నన్న సత్యాన్ని గ్రహించిన వాళ్ళు తండ్రీ కొడుకులు. ఆవిధంగా పోగేసుకొన్న ధనంతో కొంత వెచ్చించి కోరినవి పోగేసుకోగలరు.

రంగారావు సంజయ్ ఇంటికి జయంతితో వెళ్ళి - "నేను జయంతి తండ్రిని. సంజయ్ తండ్రితో మాట్లాడాలి" అని కాగితం మీద రాసి ఆ కాగితం నౌకరు ద్వారా లోపలికి పంపాడు.

సంజయ్ తండ్రి శ్రీనివాసులు, సంజయ్ ద్వారానే అతని విలాసాలు కొన్ని విన్నాడు. ఇదీ అదేబాపతు అనుకొన్నాడు.

"వాళ్ళనేం చూడక్కర్లేదు" అన్నాడు సంజయ్ కొద్దిగా బెదిరి.

శ్రీనివాసులు పకపకా నవ్వాడు.

"మనల్ని చూడాల్సిన అక్కర వాళ్ళది. వాళ్ళు మనల్ని చూసి జడుసుకుంటే మనకీ మేలే! ఇంత కొంచానికి బెదురుతావెందుకు? 'రానీ" అని నౌకరుతో వాళ్ళని లోపలికి తీసుకురమ్మన్నాడు. శ్రీనివాసులు తాపీగా పైపు ముట్టించాడు. అతను దగ్గర వాళ్ళతో పైపు కాల్చటంవల్ల రెండు లాభాలున్నాయని చెప్తాడు. మొదటిది ఎవరికి ఆఫర్ చెయ్యక్కర్లేదు. రెండవది ఎదుటి మనిషిని కనీసం పైపు పొడవు దూరం ఎడంగా ఉంచచ్చు.

రంగారావు, జయంతి లోపలికి వెళ్ళేసరికి సంజయ్ ఫిల్మ్‌ఫేర్ చూస్తున్నాడు. శ్రీనివాసులు ఫైనాన్షియల్ టైమ్స్‌చూస్తున్నాడు. వాళ్ళలో ఎవరు ఎవరైనది వయస్సుల బట్టీ పోల్చుకున్నాడు రంగారావు. తనని, జయంతిని చూడగానే సంజయ్ బెదురుతాడని రంగారావు అనుకొన్నాడు. కాని నిండుకుండలా కూర్చోగలడని అనుకోలేకపోయాడు. 'పెద్దాయనకి

కొడుకు చేసిన ఘనకార్యం తెలిసుండదు. తెలిస్తే న్యాయం జరిపిస్తాడు' - అనుకొన్నాడు.

"నేను రంగారావుని. ఈమె నా కూతురు జయంతి" అన్నాడు రంగారావు అతను అన్యాయంమీద ధ్వజం ఎత్తిన విప్లవకారుడిలా మాట్లాడలేదు. తన బిడ్డని వలవేసి పట్టి రెక్కలు విరిచిన కిరాతకుడితో, 'అదింక ఎగర్లేదు కనక దాన్ని నీ ఇంట్లో అట్టేబెట్టుకొని రోజూ నాలుగు గింజలు వెయ్య'మని అర్థించటానికి వచ్చిన తండ్రి పక్షిలా ఉన్నాడు.

'అయితే?' అన్నట్టు చూశాడు శ్రీనివాసులు. కూర్చోమని మర్యాదా చెయ్యలేదు.

"మీరు సంజయ్ తండ్రి అనుకొంటాను" అన్నాడు రంగారావు వినయంగా.

"అనే అనుకొంటాను" అన్నాడు శ్రీనివాసులు. ఆపైన అదేదో పెద్ద జోక్‌లాగా నవ్వాడు.

శ్రీనివాసులు తనతో నవ్వుతూ మాట్లాడినందుకే రంగారావు సంబరపడిపోయాడు కాసేపు. కాని జరిగింది ఎలా చెప్పాలో తెలియలేదు. ఫాన్లు తిరుగుతున్నా చెమట పోస్తోంది. జడ్జీ ముందు తీర్పుకోసం నిలబడిన న్యాయార్థిగా నిలబడే అన్నాడు. "మీ అబ్బాయి మా అమ్మాయిని..." అని.

ఆ మాటల్ని సగంలో తుంచేస్తూ "ఎక్కడ?" అని అడిగాడు శ్రీనివాసులు, 'లా'లో ఎవరిల్లు అన్నది చాలా ముఖ్యం అయిన పాయింటు కనక.

"మీ ఇంట్లోనే" అన్నాడు రంగారావు, ఏం జరిగిందో చెప్పాల్సిన అవసరం లేనందుకు గుండెమీద నుంచి బరువు దింపినట్టు కాగా.

"ఎందుకు వచ్చింది?"

"సంజయ్ పిలిచాడు".

"పిలిస్తే ఇళ్ళకు వెళ్ళే రకమన్న మాట మీ అమ్మాయి. ఎ కాల్‌గర్ల్" అన్నాడు తాపీగా శ్రీనివాసులు.

శ్రీనివాసుల విశ్వరూపంలో చిన్న భాగాన్ని తిలకించి అదిరిపోయాడు రంగారావు.

జయంతి కళ్ళెత్తి సంజయ్ కేసి చూసింది. ఆమెలో సంజయ్ మంచితనం పట్ల ఆశ చావలేదు. సంజయ్ కళ్ళు కలపలేదు. తన కేం పట్టనట్టు కూర్చున్నాడు.

దుష్యంతుడి సభలో శకుంతల లాగా జయంతి నిలబడింది. అయితే తీసుకువచ్చినవాడు కణ్వుడు. చేరదియ్యాల్సినవాడు దుష్యంతుడి తండ్రి.

"ఛఛ! ఇంతకుపూర్వం ఎప్పుడూ వెళ్ళలేదు" అన్నాడు రంగారావు.

"ఇకముందు వెళ్తూ ఉంటుందన్న మాట. వెరీ గుడ్, అమ్మయి బంగారుబొమ్మలా ఉంది. ఈ పెట్టుబడితో బిజినెస్ సరిగా మేనేజ్ చేస్తే ప్రాఫిట్స్ బాగానే ఉంటాయ్." ఈ సలహా నిజాయితీతోనే ఇచ్చాడు శ్రీనివాసులు.

"కన్న తండ్రినే తార్చమంటారా?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారావు, కల్చరల్ డిఫరెన్సు వల్ల కలిగిన షాకు తిని.

"పోనీ అవసరం అయినప్పుడు నేను కబురు పెడతాను. పంపిస్తే సరి తడవ కింతని నేనే ఇస్తాను" అన్నాడు శ్రీనివాసులు.

శ్రీనివాసులుకి జయంతి అందాన్ని నిజంగా సద్వినియోగం చెయ్యాలనే ఉండి అతను వ్యాపారానికి వచ్చే దేన్నీ నిర్లక్ష్యం చెయ్యడు.

ఆ మాటలకి రంగారావుకి చెమట పొయ్యటం మాని వణుకు మొదలైంది చలికాలం ఇనుముని ముట్టుకొన్నట్టుగా చల్లదనం ఆవహించింది.

"మీకే ఒక కూతురుండి ఉంటే..." అన్నాడు ధైర్యం కూడదీసుకొని. అన్న దాంట్లో జోరు లేకపోయినా వాడి ఉంది.

శ్రీనివాసులు ఆలోచనలో పడ్డాడు. పెళ్ళాన్ని వాడుకొన్నట్టు తనకే ఓ కూతురుంటే వాడుకోగలిగేవాడా? భార్య పరాయమ్మ కన్నబిడ్డ. కూతురు తన రక్తం పంచుకొని పుట్టినదీను. తనకి కూతురు లేదు. ఉంటే ఈ ఘోరపరీక్షలో తనేం చేసేవాడో!

"మేమేం చెయ్యాలి అయితే?" శ్రీనివాసులుకి అవతలి వారి కోర్కె వినాలనిపించింది. తన మాటల్లో రంగారావుని మీరు అని మన్నిస్తూమాట్లాడకుండా, తన హెూదా కాపాడుకుంటూ జాగ్రత్తపడుతూనే సంభాషణ కానిచ్చాడు.

రంగారావుకి హఠాత్తుగా ప్రత్యక్షమైన భూతం "నీకేం కావాలి?" అని అడిగినట్టయి ఏం కోరాలో తట్టలేదు. ఆయన ఇంట్లో బయల్దేరినప్పుడు తనేం కోరాలని బయల్దేరాడో అది కోరలేకపోయాడు. ఈ డేగల నివాసంలోకి తన ప్రియమైన పావురాన్ని పంపలేడు.

"మీ అబ్బాయి చేసిన తప్పు..." ఆ వాక్యం ఎలా పూర్తి చెయ్యాలో రంగారావుకి తెలియలేదు.

"శిక్ష వెయ్యాల్సిందే. ముహూర్తం పెట్టిస్తే మూడు ముళ్ళూ వేస్తాడు" అన్నాడు వ్యాపార దక్షతకల శ్రీనివాసులు.

తండ్రి హఠాత్తుగా ఈ నిర్ణయానికి రావటం సంజయ్‌ని ఆశ్చర్యపరిచింది.

'ఏమిటీ లీల?' అన్నట్టు చూశాడు.

'అదంతేలే?' అన్నట్టు చూశాడు శ్రీనివాసులు.

ఆ ఇంట్లో పడితే తన ఫ్యూచర్ ఏమిటో స్పష్టంగా జయంతికి తెలిసిపోయింది. అప్పుడు తోక తొక్కిన ఆడతాచులాగా బుసకొట్టింది. "నేను మీ అబ్బాయిని -సంజయ్- మీ అబ్బాయనే నేనూ అనుకొంటున్నాను మీరు అనుకొంటున్నట్టే - నేను పెళ్ళి చేసుకొనే స్థితికి దిగజారలేదు".

సంజయ్ ఈ జయంతిలో ఇంత ఫోర్స్ఉందా అని ఆశ్చర్యపోయాడు. ఈ అమ్మాయిని పెళ్ళి చేసుకొంటే లైఫ్‌లో కొంత థ్రిల్ ఉండేటట్టుంది అనుకొన్నాడు సంజయ్.

వెంటనే రంగులు మార్చేసి, గోముఖంతో-"నన్ను క్షమించు జయంతీ" అన్నాడు.

'నాటకం రక్తికడుతోంది' అనుకొన్నాడు శ్రీనివాసులు.

"నువ్వు నా అందాన్ని పెట్టుబడిలా వాడుకొని లాభాల్ని పొందటం నా కిష్టంలేదు సంజయ్. నాలో ప్రేమ ఇంకిపోయింది" అంది జయంతి.

"నను నమ్ము జయంతీ" అన్నాడు సంజయ్.

"నా బుద్ధిహీనతవల్ల నా శరీరాన్ని వాడుకొనే అవకాశాన్ని పొందావు ఒకసారి. ఇప్పుడు నీ మనసు నిజంగా జరిగిందానికి బాధపడుతూందే అనుకొన్నా, నీ శరీర బాధ తొలగించుకొటానికి నా శరీరాన్ని వాడుకొన్నట్టే నీ మనసు పడే బాధని తొలగించు కోడానికి నా సహచర్యం వాడుకోవాలని నువ్వు చేసే ప్రయత్నాలకి నేను దోహదం చెయ్యను. నన్ను ఏవిధంగానూ మరోసారి వాడుకొనే ఏ అవకాశం నీ కియ్యను" అంది జయంతి.

శ్రీనివాసులు లేచి నిలబడ్డాడు గోముఖం విదిలించి నిలబడ్డ వ్యాఘ్రంలాగా.

"వెళ్తే మహాభేషుగ్గా వెళ్ళండి. కాని ఎక్కడైనా మా సంజయ్ నిన్ను పాడుచేశాడని పిచ్చి పిచ్చిగా వాగారా జాగ్రత్త! పుచ్చె లెగిరిపోతాయి ! పోలీసులకి రిపోర్ట్ చేద్దా మనుకుంటున్నారేమో- అట్లాంటి దేవైనా జరిగితే పదిమంది పందుల్లాంటి గూండాల్ని పంపించి నిన్ను కుమ్మించేస్తాను. వాళ్ళు నిన్ను పీల్చి పిప్పిచేసి, బొంబాయి తీసుకెళ్ళి అక్కడ పందుల సంతలో కసాయి వాళ్ళకమ్మేసి చక్కావస్తారు. ఆ తరువాత తీరుబడిగా మిగిలిన వాళ్ళ పుచ్చె లెగరగొట్టేసి అవి పుచ్చుకొని సారా దుకాణానికి వెళ్ళి వాటిల్లో సారా తాగెయ్యగలరు జాగ్రత్త!" అన్నాడు. అన్నంత పనీ చెయ్యగలనన్న విశ్వాసంతోనే అన్నాడు.

రంగారావు ఆ మాటల్ని సందేహించలేదు. జయంతిని తీసుకొని బయటవడ్డాడు.

" బెదిరిద్దామని వచ్చారు. బెదిరి వెళ్ళిపోయారు. పెళ్ళి చేస్తానని నేను అన్నా వద్దని వాళ్ళంత వాళ్ళే మానుకొని పోయారు. అదిరా నాన్నా పద్ధతి. ఏం జరిగినా అంతా మన మంచికే'"అన్నాడు శ్రీనివాసులు కొడుకుతో.

ఇంటికి వచ్చిన రంగారావుని "ఏం చేసుకువచ్చారు?" అని అడిగింది మహాలక్ష్మి.

రంగారావు జరిగింది చెప్పాడు.

అంతా విన్నాక ఆమెకూ ఏమనాలో పాలుపోలేదు. తమకు కావలసింది నష్టపరిహారం. అది మరింత అరిష్టాన్ని తెచ్చిపెట్టేలా తయారైంది. డబ్బు నష్టపరిహారంగా స్వీకరించదలుచుకుంటే శ్రీనివాసులు చెప్పినట్టు పదే పదే నష్టపోయి పరిహారాలు పొందుతూ వ్యాపారం చెయ్యవచ్చు.

దుష్టశిక్షణ జరగాలి అని కోరుకొందామా అది దుష్టులతో తెచ్చుకొన్న కక్ష. వారి చేతుల్లో శిక్షలకి దారితీస్తుంది. కర్మకి ఏడవటం తప్ప చేసేది ఏమీ లేదు.

శనివారం గాంధీ సినిమా ఎటెన్‌బరోది టీవీలో చూపించారు.

అది చూసిన మధు- "నాన్నా!" అన్నాడు తండ్రితో ఏదో చెప్పదలచి.

"ఏమిట్రా?" తండ్రి అడిగాడు.

"గాంధీ బతికున్నన్నాళ్ళు మనకి చెప్పిందేమిటి? చావుతో ఇచ్చిన సందేశం ఏమిటి?"

"అహింస."

"అది మార్గం. లక్ష్యం అది కాదు. లక్ష్యం అన్యాయాన్ని ఎదిరించటం. దానికి ముందుగా భయాన్ని త్యజించాలి".

"అంటే!"

"మనం శ్రీనివాసుల గూండాలకి జడవకూడదు" అన్నాడు మధు.

"సంజయ్ నేరం చేశాడు.అతను మరొకరికి అటువంటి అన్యాయం చెయ్యరాదు" అంది జయంతి దృఢంగా.

"అందరూ గాంధీలు కాలేరు. మనం సాధారణులం" అన్నాడు రంగారావు.

"పిరికితనం మనల్ని అలా అనుకొనేలా చేస్తోంది. అతనికి శిక్ష పడే ప్రయత్నం మనం చెయ్యాలి" అన్నాడు మధు ఉద్రేకంగా.

"అతన్ని శిక్షించే శక్తి మనకి లేదు. మనకే పాపం అంటదు "

"తిరగబడని పాపం తప్పించి" అని గొణుకున్నాడు మధు.

మళ్ళీ ఆదివారం వచ్చింది. స్నానం చేసి పూజచేసుకొని భగవద్గీత తెరిచాడు రంగారావు.

"ధర్మణ్యే వాధి కారస్తే..."

రంగారావు ఆగిపోయాడు. ఆలోచనలో పడ్డాడు. ఫలితం గురించి ఆలోచించమని తన కెవడు చెప్పాడు! తన బాధ్యత తను నెరవేర్చాలి! పిచ్చుకల్లాంటి, పిపీలికాల్లాంటి బక్క జనాల మీద నీతినియమాల బ్రహ్మాస్త్రాలు ప్రయోగించటానికే కాదు. పుస్తకాల్లో నిదర్శనా లుండేది. వెతుక్కుంటే అన్యాయాలను ఎదుర్కోమని, ఆ ఎదుర్కోడంలో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా లెక్క చేయవద్దని ఉద్బోధించే ఉవాచలు కూడా ఉంటాయి. అన్యాయాన్ని రూపుమాపే శక్తి తనకి లేకపోవచ్చు గాక దాని రూపు చూపే శక్తి తనకుంది. దాన్ని ఎత్తి చూసే చిన్న వెలుతురు తను వెలువరిస్తాడు. దానికి తను అగ్గిపుల్లగా కాల్తే కాల్తాడు!

అన్యాయాన్ని శిక్షించే శక్తి ఉన్నవాడి దృష్టికి తెచ్చే ప్రయత్నం తాను చెయ్యాలి.

రంగరావు మనసు తేలికపడింది జయంతికి మధుకి తన నిర్ణయం చెప్పాడు. దుష్టశిక్షణ చేయగల శక్తిని పుట్టించే శక్తి తనకు ఉందని రంగారావు గ్రహించే కాలం దగ్గర్లోనే ఉంది. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూడక తనే ప్రయత్నించే కాలం అది. ●

(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక జూన్ 1988)